మహిళా ఉద్యోగులకు సన్మానం..

తాండూరు, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండా లన్నారు. అందుకు ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తుందని గుర్తు చేశారు. విద్యార్థి దశనుంచే బాలికలు ధైర్యంగా ముందుకు సాగేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు.

టీమిండియా గెలుపుతో అన్నదానం

మర్పల్లి, మార్చి 10 : ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్లో టీమిండియా విజయం సాధించిన సందర్భంగా ఘనపూర్ గ్రామానికి చెందిన జగదీశ్వర్ సోమవారం మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు తేజస్వీ గౌడ్, జగదీశ్, రాజశేఖర్ రెడ్డి, ఎర్రోల్ల లక్ష్మయ్య, రమేశ్, సునీల్, రవి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్లు అప్పగింత

ధారూరు, మార్చి10 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోగొట్టుకున్న తొమ్మిది మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.అనిత తెలిపారు. సోమవారం వీటిని బాధితులకు అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్లను పొగొట్టుకుంటే ధారూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ప్రజావాణికి దరఖాస్తులు కరువు

బొంరాస్‌పేట్, మార్చి10 : బొంరాస్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేవారు కరువయ్యారు.ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉండడంతో గ్రామాల నుంచి నేరుగా మండల కేంద్రానికి వచ్చి తమ సమస్యలను రాత పూర్వకంగా అధికారులకు తెలిపేవారు.కానీ సోమవారం మాత్రం ఎలాంటిలాంటి దరఖాస్తులు రాలేదు. మండల అధికారులు మాత్రమే ప్రజావాణిలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఏవో తులసి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బండ్లగూడ, మార్చి 10: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడకు చెందిన రవి (45) తన కుమారుడు విజయ్‌తో కలిసి అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తున్నారు. శివరాంపల్లికి చేరుకోగానే రవి ముందు వెళ్తున్న మరో బైకును ఢీకొట్టాడు. ఈ ఘటనలో రవి కింద పడి తలకు తీవ్ర గాయాలు కాగా.. విజయ్ స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

మద్యం మత్తులో భవనం పైకెక్కి..

ఎల్బీనగర్, మార్చి 10: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి నిర్మాణంలో ఉన్న భవనం నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మరణించాడు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సరూర్ నగర్ కు చెందిన బొడ్డు కృష్ణ (50) ఆదివారం రాత్రి మద్యం మత్తులో కోదండరాం నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం ఎక్కాడు. ప్రమాదవశాత్తు అక్కడి నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అక్కడికక్కడే మరణించగా.. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పురుషులతో సమానంగా పోటీ పడాలి

తాండూరు రూరల్, మార్చి 10: నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు అంది పుచ్చుకోవాలని తాండూరు నియోజకర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం కన్వీనర్ శకుంతలా దేశ్‌పాండే అన్నారు. సోమవారం తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్ అన్న మహిళా చేయూత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. వచ్చే రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సర్పంచ్ వీణ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ రోహిత్ అన్న చేయూత ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్క్స్, చేతివృత్తి నైపుణ్యాలు నేర్పించడం జరిగిందన్నారు. స్వయం కృషితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉన్నారు.

బీఆర్ఎస్ మహిళా విభాగం కన్వీనర్ శకుంతలా దేశ్‌పాండే

కరణ్‌కోట గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్న మహిళలు

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

తాండూరు రూరల్, మార్చి 10: గుండెపోటుతో ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి....తాండూరు పట్టణంలోని సీతారం పేటలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రాంచందర్ (50) తాండూరు రూరల్ పోలీసు సర్కిల్ కార్యాయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మొదటి సారి గుండెపోటుకు గురికావడంతో స్టంట్స్ వేయించారు. అనంతరం మరోసారి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో కానిస్టేబుల్ రాంచందర్ మృతి చెందాడు. రాంచందర్ మృతికి తాండూరు డీస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ, రూరల్ సీఐల తోపాటు డివిజన్‌లోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది ప్రగాఢసానుభూతి తెలిపారు.

పాఠశాల ఆవరణలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు

బొంరాస్‌పేట్, మార్చి10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో కొత్తగా హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. లైట్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మరమ్మతు పనులు

బొంరాస్‌పేట్, మార్చి10 : కలెక్టర్ అదేశాల ప్రకారం బొంరాస్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 3.5 లక్షల రూపాయలతో మరమ్మత్తుల పనులను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ హేమంత్ తెలిపారు.ఆసుపత్రిలో ప్లంబింగ్, గోడల లీకేజీ పనులను నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. తాగునీరుకు సంబంధించి కొత్తగా బిల్డింగ్‌పై వాటర్ ట్యాం కులు, కొత్త వాటర్ పైపులు, విద్యుత్‌కు సంబంధించిన పనులను,ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అయన తెలిపారు.

ఆదర్శ పాఠశాల ఎదుట నిరసన



పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మహేశ్ కుమార్ కుటుంబ సభ్యులు

మర్పల్లి, మార్చి 10 : మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో పదేండ్లుగా కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న మహేశ్ కుమార్ అనారోగ్యం కారణంగా దవాఖానలో చికిత్స చేయించుకుని విధులకు వెళ్లితే అక్కడ జాబులోనుంచి తొలగించారని ఆందోళన చెందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల/కళాశాలలో 2013 నుంచి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నానని, అనారోగ్య సమస్యతో 2024 డిసెంబర్ 2న ఈఎస్ఐ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాను. ఈ సమాచారం ప్రిన్సిపాల్ ప్రమీలకు ఫోన్ ద్వారా సమాచారం అందించానని కానీ తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తన స్థానంలో కొత్తగా కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకున్నారని వాపోయాడు. ఆదర్శ పాఠశాల ఏజెన్సీ అయిన విశ్వముఖ ఏజెన్సీని అడుగగా వర్క్ ఆగి పోవడంతో ప్రిన్సిపాల్ కోరారని పార్ట్‌టైమ్ కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించామని తెలిపారన్నారు. సోమవారం పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను కలిసి అడిగితే ఏజెన్సీ వారినే సంప్రదించాలని చెప్పారన్నారు.. అటు ఏజెన్సీ వారు ఇటు ప్రిన్సిపాల్ ఒకరిపై ఒకరు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. సంబంధిత అధికారులు స్పందించి పది సంవత్సరాలుగా పని చేస్తున్న తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, తమ కుటుంబం రోడ్డున పడకుండా చూడాలని మహేశ్ కుమార్ కోరారు.

ఘనాపూర్ గ్రామ సంఘం అధ్యక్షురాలుగా యాదమ్మ

కులకచర్ల, మార్చి 10 : ఘనాపూర్ గ్రామ సంఘం నూతన అధ్యక్షురాలుగా చీపిరి యాదమ్మ ఎన్నికయ్యారు. సోమవారం గ్రామంలో ప్రస్తుత అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన గ్రామ సంఘం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలుగా పోటీకి ముగ్గురు ముందుకు రాగా ఎన్నికలు నిర్వహించగా యాదమ్మకు ఎక్కువ ఓట్లు రావడంతో ఆమెను గ్రామ సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా నేనావత్ శాంతిబాయి, కోశాధికారిగా కర్రె వెంకటేశ్వరి, ఉపాధ్యక్షురాలుగా దండులక్ష్మి, సహాయ కార్యదర్శిగా కటికె అంజిలమ్మలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది సీసీ, వీవోఏలు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలిని, పాత అధ్యక్షురాలును ఘనంగా సన్మానించారు.

నేడు ఇందిరమ్మ కమిటీల సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 10 : పరిగి పట్టణంలోని మినీ స్టేడియంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే రామ్మో హన్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నెం.1 ఆవరణలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మహిళలకు ఉద్యోగావకాశాల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళలు జాబ్‌మేళాకు హాజరవ్వాలని ఆయన కోరారు. పరిగి నుంచి వికారాబాద్‌కు నాలుగు లేన్ల రహదారి, పరిగి నుంచి షాద్‌నగర్‌కు నాలుగు లేన్ల రహదారి, గడిసింగాపూర్ నుంచి రంగారెడ్డిపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన, పరిగి కొత్త కుంట చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేపట్టనున్నట్లు తెలిపారు. పరిగి–కృష్ణా రైల్వేలైన్ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. వచ్చే బడ్జెట్‌లో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులతో ప్రణాళికలు తయారు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పరిగిలో రౌండ్ టేబుల్ సమావేశం

పరిగి, మార్చి 10 : పరిగి నియోజకవర్గాన్ని నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, కొత్త మండలాలు, గ్రామపంచాయతీల ఏర్పాటుపై 11వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో టీజేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు టీజేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు హాజరుకావాలని కోరారు



ధారూరు, మార్చి 10: మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో జరుగుతున్న బీరప్ప జాతరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సోమవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, రాములు, మైపాల్ రెడ్డి, నందు, చంద్రయ్య, వెంకట్‌రామ్ రెడ్డి, అంజయ్య, మహేశ్, చంద్రయ్య, జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బొంరాస్‌పేట్, మార్చి10 :మండలంలోని బొట్లోనితండా గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి 163 పక్కన చలివేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నెహ్రూనాయక్, హెచ్ఎం విక్రమ్‌సింగ్ అధ్వర్యంలో తండావాసులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమం లో బాలు, రాజు, లాలు, కిషన్, నార్య, నాని, ప్రవీణ్, లచ్చునాయక్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులతో తీరిన తిప్పలు..

కొడంగల్, మార్చి 10: మండలంలోని టేకల్‌కోడ్ గ్రామంలో రెండు నెలలుగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొని గ్రామస్తులు ఇటీవల ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో దాదాపు 500ల ఇండ్లకు గాను మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లు ఉండగా 150 ఇండ్ల ప్రాంతంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామంలోని ఓపెన్ బావి ద్వారా నీటిని నింపుకొని ఆ వీధి వాసులు కాలం గడిపారు. ఈ వార్త 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైంది. దాంతో మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తమై పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. దాంతో గ్రామంలోని అన్ని వీధులతో పాటు ఆ వీధి వాసులు కూడా మిషన్ భగీరథ నీటిని పట్టుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client T. Raghava Reddy, S/o. Late T. Narsimha Reddy, R/o H. No. 3-4-551, Aruna Arcade, Narayanguda, Hyderabad, entered into an agreement with Nagulagari Anji Reddy, S/o. Late Sri Ram Reddy, R/o. H.No.4-14, Kandukur, R.R. District, to purchase the agricultural dry land, in Sy.No.s 81/AA3, 81/A/2AA/1, 81/A/RU, admeasuring Ac 0–06 gts, Ac 0–04 gts, & Ac 0–10 gts, respectively, situated at Nyamathapur Village, Kadthal Mandal, R. R. District, and paid sufficient amount as advance.

If any person/s have any objections for the above transaction may approach the under signed with relevant documents within 7 days hereof. Failing which my clients will complete the sale transaction.

Sd/- **K. GOVARDHAN REDDY**
Advocate
H.No: 1-6-430/1, Zamistanpur, Musheerabad, Hyderabad-500020.
Ph: 9848138076

హైడ్రా ప్రజావాణికి 63 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ఏవీ రంగనాథ్

సిటీబ్యూరో, మార్చి 10(నమస్తే తెలంగాణ): తల్లిదండ్రులు అమ్మినప్పటికీ కొడుకులు కొత్త పాసుపుస్తకాలు సృష్టించుకొని పాత లే అవుట్లను చెరిపేసి సాగు చేసుకుంటున్నారని పలువురు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు చేశారు. సోమవారం బుద్ధభవన్లోని హైడ్రా ప్రజావాణిలో 63 ఫిర్యాదులు రాగా కమిషనర్ రంగనాథ్ స్వీకరించారు. ఈ ఫిర్యాదుల్లో పాత లేఅవుట్ల ఆక్రమణలతో పాటు.. రహదారులు, పార్కులను కాపాడాలని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులందాయి. తుర్కయాంజల్ చెరువులోకి వెళ్లే వాననీటికి అడ్డంగా గోడ కట్టడంతో వరద తమ కాలనీని ముంచెత్తుతున్నదంటూ ఏవీనగర్ 2 నివాసితులు ఫిర్యాదు చేశారు. ఘట్కేసర్ మండలం ప్రతాప్‌సింగారంలో 25.17 ఎకరాల్లో 390 ప్లాట్లతో 1989లో లే అవుట్ చేయగా.. అందులో 88 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయని, మొత్తం 6.14 ఎకరాల భూమి తనదంటూ ధరణి ద్వారా పాసుపుస్తకాన్ని సృష్టించి కబ్జా చేశారంటూ ప్లాట్లు కోల్పోయిన వారు ఫిర్యాదు చేశారు. మేడిపల్లి మండలం బోడుప్పల్‌లోని దేవేందర్‌నగర్ కాలనీ సర్వే నెంబర్ 63బై 1 లోని 1200 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ స్థానికులు విన్నవించారు. వీటిపై త్వరలోనే విచారణ జరుపుతామని కమిషనర్ చెప్పారు.

క్రికెట్ బెట్టింగ్.. పలువురి అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 10: ఆన్‌లైన్ వేదికగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వెబ్‌సైట్ యాజమాన్యంతో పాటు మరో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళ్తే.. ఆదివారం రాత్రి దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ భారత్ న్యూజిలాండ్ మధ్య జరగగా.. కృష్ణానగర్ 'బీ' బ్లాక్ లోని రిలాక్స్ వైన్స్ లో మణి వేలాశివ (25) తెలుగు 365 డాట్ ఇన్ వెబ్‌సైట్ వేదికగా బెట్టింగ్ పాల్పడ్డాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. మొబైల్ యాప్ లో పలువురు నుంచి నగదు స్వీకరించినట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తన స్నేహితుడు శివ ద్వారా బెట్టింగ్ వెబ్‌సైట్ ద్వారా తెలిసిందని మణి చెప్పగా.. తెలుగు 365 డాట్ ఇన్ వెబ్‌సైట్ నిర్వాహకులతో పాటు శివ, మణి వేలాశివ మీద గేమింగ్ యాక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వెంగళరావునగర్‌లో..

వెంగళరావునగర్, మార్చి10 : క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు బెట్టింగ్ యాప్‌పై సైతం కేసు నమోదు చేశారు. ఎస్.ఆర్.నగర్ పోలీసుల కథనం ప్రకారం.. సుభాశ్‌నగర్ కు చెందిన కె.ఈశ్వర్ (31) శ్యామలకుంట పార్క్ వద్ద ఉన్న ఓ టీ స్టాల్ లో న్యూజిలాండ్, ఇండియా మధ్య జరిగిన మ్యాచ్‌పై బెట్టింగ్ చేస్తుండగా.. సమాచారం అందుకున్న పశ్చిమ మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి అతన్ని పట్టుకున్నారు. యాప్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకోగా ఈశ్వర్‌తో పాటు బెట్టింగ్ యాప్‌పై ఎస్.ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం
80966 77668
80966 77962